నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 27 డిసెంబర్ 2023 | NALGONDA

వెన్నముద్ద కృష్ణుడిగా యాదగిరీశుడు

రాత్రి కాళీయమర్ధనుడి అలంకారంలో దర్శనమిచ్చిన స్వామి వారు

యాదగిరిగుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు

వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో లక్ష్మీనరసింహ స్వామి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారికి మార్గళి పూజల్లో భాగంగా 21వ పాశురాలను అర్చకులు, పారాయణందారులు పఠించారు. అనంతరం స్వామివారి అలంకార సేవలు ఆగమ శాస్త్రరీతిలో జరిగాయి. ఉదయం వెన్నముద్ద కృష్ణుడిగా యాదగిరీశుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని వెన్నముద్ద కృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక సేవపై అధిష్ఠింపజేసి సేవోత్సవాన్ని నిర్వహించారు. సేవోత్సవంలో దివ్య ప్రబంధ పఠనం కొనసాగించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చక బృందం దివ్య ప్రబంధ పఠనం చేస్తుండగా అలంకార సేవలను ప్రధానాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు అలంకార సేవలను కనులారా వీక్షించి తరించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి వేళ లక్ష్మీనరసింహస్వామిని కాళీయమర్ధనుడిగా అలంకరించి ఊరేగించారు. ద్రావిడ ప్రబంధ సేవా కాలంలో పారాయణిక స్వాములతో సేవోత్సవం చేపట్టారు.

కాళీయమర్ధనుడి అలంకారంలో స్వామివారి ఊరేగింపు

గురుకులాల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నల్లగొండ, డిసెంబర్ 26 : జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విజయేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పీసీఈ, సెక్యూరిటీ గార్డు, హౌస్ కీపింగ్ కోసం స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల అనుభవం ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేసి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో, లేదా రీజినల్ కో ఆర్డినేటర్ కార్యాలయం, నల్లగొండలోని హెచ్ కంప్యూటర్స్ ఏజెన్సీలో ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలకు సంబంధించి అందరి నుంచి దరఖాస్తులు

జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి

నల్లగొండలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సన్నాహక సమావేశం

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వేదికపై జిల్లా మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, బాలూనాయక్, వేముల వీరేశం, నలమాద పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, మందుల సామేల్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, నల్లగొండ, సూర్యాపేట ఇన్‌చార్జి కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, సీహెచ్ ప్రియాంక, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు

'ప్రజా పాలన' పకడ్బందీగా నిర్వహించాలి

రేపటి నుంచి జనవరి 6 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల

నల్లగొండ, డిసెంబర్ 26 : 'ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో ప్రజా పాలన సభలు నిర్వహించాలి. ఆరు గ్యారెంటీలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి.' అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మినిస్టర్ తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. నల్లగొండ పట్టణంలోని ఎంఎన్ ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రజాపాలన కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 6వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అందరికీ సౌకర్యంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించి ప్రజలు దరఖాస్తులు నింపేలా యంత్రాంగాన్ని సమాయత్తం చేసుకోవాలని అన్నారు. హెల్ప్ డెస్క్, సాధారణ దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రద్దీ ఎక్కువ ఉన్నచోట టీమ్‌లను పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాలో 151 బృందాలు : నల్లగొండ ఇన్‌చార్జి కలెక్టర్ పాటిల్

జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రజా పాలన కార్యక్రమాలు చేపడుతామని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 151 బృందాలు ఏర్పాటు చేశామని నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. మొత్తం 844 గ్రామపంచాయతీల్లో 112, ఎనిమిది మున్సిపాలిటీల్లోని 182 వార్డు ల్లో 39 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా పాలనలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6 గంటల వరకు 2 షిఫ్టుల్లో నిర్వహిస్తామని తెలిపారు.

సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ ప్రియాంక మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమాల కోసం జిల్లాలో 58 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. 475 గ్రామపంచాయతీల్లో 46, ఐదు మున్సిపాలిటీల్లోని 141 వార్డుల్లో నిర్వహించేందుకు 12 బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే జిల్లాలో చేపట్టే ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో ప్రజల వద్దకు తీసుకెళ్తామని, ప్రభుత్వం ఆశించే లక్ష్యాలను నెరవేరుస్తామని అన్నారు. మున్సిపాలిటీల్లో 14, గ్రామీణ ప్రాంతాల్లో 37 కలిపి మొత్తం 51 బృందాలతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1961 కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, బాలూనాయక్, వేముల వీరేశం, నల్లమాద పద్మావతి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, మందుల సామేల్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, భాస్కర్‌రావు, వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎస్పీ అపూర్వరావు, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, సూర్యాపేట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు : మంత్రి ఉత్తమ్

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ప్రభుత్వ ఉద్దేశాలను అధికారులు నెరవేర్చాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీల్లో రెండింటిని ఇప్పటికే అమలు చేస్తున్నామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం త్వరలో మొదలు పెడుతామని చెప్పారు. ప్రజల సంక్షేమంలో పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా ఉంటామని.. అధికారులు కూడా న్యాయంగా, ధర్మంగా, చట్టపరంగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే ఆరు గ్యారెంటీలు అమలవుతాయన్నారు. తమ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డులపై కిలోకు రూ.39 వెచ్చించి పంపిణీ చేస్తున్న బియ్యం రీ సైక్లింగ్ అవుతూ పౌల్ట్రీలకు వెళ్తున్నదని, ఇది దుర్మార్గమైన విషయమని పేర్కొన్నారు. రేషన్ బియ్యం రీ సైక్లింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ సరఫరాలో ప్రక్షాళన చేస్తామని నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని అన్నారు.

ప్రజా పాలనకు తగిన ఏర్పాట్లు చేయాలి : మంత్రి కోమటిరెడ్డి

పటిష్టమైన ఏర్పాట్లు, తగిన టీమ్‌లతో ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. మంచినీరు, కుర్చీలు, ఇతర వసతులు కల్పించాలని, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గిరిజన గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుదారులు ఎవరూ మిస్ కావద్దని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ పేదల వద్దకు ప్రభుత్వ పథకాలు తీసుకుపోవాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అధికారులు ఎక్కువ గంటలు పని చేయాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో పాల్పంచుకోవాలని సూచించారు. యువతను పెడదారి పట్టించే బెట్టింగ్ షాపులు, గంజాయి అమ్మకాలపై పోలీసులు ఎక్కువ శ్రద్ధ పెట్టాలని.. ఇసుక, గంజాయి, వైన్ మాఫియాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి అందరికీ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

పొగమంచుతో పైలం

ఉమ్మడి జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ

- దట్టంగా కురుస్తున్న మంచుతో జనం ఉక్కిరిబిక్కిరి
- దగ్గరికొచ్చేదాకా కనిపించని వాహనాలు
- రోడ్లపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వరంగల్, విజయవాడ హైవేలపై వాహనదారుల ఇక్కట్లు
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలకు అవకాశం
- అత్యవసరమైతేనే నైట్ జర్నీ చేయాలని నిపుణుల సూచన
- రానున్న పండుగల ప్రయాణాలూ కష్టమే..
- ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపే ఛాన్స్

సూర్యాపేటలో పొగమంచులో లైట్లు వేసుకొని వెళ్తున్న బస్సు

వెన్నులో వణుకు పుట్టించే చలికి ఇప్పుడు పొగమంచు తోడైంది. రాత్రి నుంచి ఉదయం 9గంటల దాకా దట్టంగా మంచు కురుస్తున్నది. దాంతో జనాలు శ్వాస సంబంధ సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు వాహన దారులకు తిప్పలు తప్పడం లేదు. పొగ మంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అత్యవసరమైతే తప్ప రాత్రి ప్రయాణాలు చేయకూడదని పోలీసులు సూచిస్తున్నారు. ఇక డిసెంబర్ 31, జనవరి 1, సంక్రాంతి పండుగలు ఉండటంతో జర్నీకి ఇబ్బందులు తప్పేలా లేవు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు యాదాద్రి భువనగిరిలో 12.7 డిగ్రీలు, నల్లగొండలో 13.8, సూర్యాపేటలో 16.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : చలి కాలం కావడంతో ఉదయం తొమ్మిది దాటినా సూర్యుడు రావడం లేదు. సాయంత్రం నుంచి ఉదయం వరకు చల్లని వాతావరణం ఉంటున్నది. జనం చలికి గజగజ వణికిపోతున్నారు. ఉదయం 10గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. ఈ నెలతోపాటు జనవరి మొత్తం దట్టమైన పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి ప్రారంభంలో మంచు తగ్గుముఖం పట్టవచ్చని తెలియజేస్తున్నారు.

రోడ్లు కనిపిస్తలేవ్..

రోడ్లపై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. సాయంత్రం నుంచి మంచు ప్రభావం పెరుగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 100 నుంచి 200 మీటర్ల వరకు కూడా రోడ్డు కనిపించడం లేదు. ఉదయం 10దాటినా వాహనాలకు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. దగ్గరికి వచ్చే దాకా ఎదురుగా వచ్చే బండ్లు కానరావడం లేదు. వాహనం ముందు దారుందో, వాహనం ఆగి ఉందో తెలియక అవస్థలు పడుతున్నారు. దాంతో డ్రైవర్లు బిక్కుబిక్కుమంటూ డ్రైవింగ్ చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నెమ్మదిగా వెళ్తున్నాయి. ముఖ్యంగా వరంగల్, విజయవాడ జాతీయ రహదారులపై వాహన దారులకు తిప్పలు తప్పడం లేదు. కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అవుతున్నది.

ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలర్ట్

తెలంగాణ రాష్ట్రం వైపు తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాకు మంగళవారం వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బుధవారం కూడా యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది. భారీగా పొగమంచు పరిస్థితులు ఉంటాయని తెలిపింది.

ఆరోగ్యంపై ప్రభావం..

పొగ మంచు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై పంజా విసురుతున్నది. శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హృదయ స్పందనల్లో మార్పులు వస్తాయి. పంటలు, పశు పక్షాదులకు సైతం తీవ్ర నష్టానికి గురిచేస్తున్నది. ఈ నేపథ్యంలో పొగ మంచుతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు చిన్నపాటి గాలి తగిలినా జలుబు, దగ్గు వంటి రుగ్మతలు దరి చేరుతాయి. చిన్నారులు, ఆస్తమా రోగులుకు సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇంటి నుంచి బయట వెళ్లకుండా చూసుకోవడం మంచిది. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే..

- మంచుతో జాగ్రత్తలు పాటించాల్సిందేనని నిపుణులు సూచిస్తు న్నారు. కొత్త రోడ్లపై మలుపులు, రహదారుల స్థితిగతులపై అవగాహన ఉండదు.
- మంచు తెరలు తొలిగిపోయాకే ప్రయాణాన్ని కొనసాగించాలి.
- వాహనానికి వెనుక, ముందు రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా అతికించాలి. తక్కువ వెలుతురులోనూ స్పష్టంగా రంగులు వెదజల్లే స్టిక్కర్లు అంటించాలి.
- వాహనానికి ఫాగ్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి. పసుపు వర్ణంతో వెలిగే ఈ దీపాలు శీతాకాలంలో ఎంతో మంచిది. మంచు తెరల నుంచి కాంతి ప్రసరించి వెలుతురు కనిపిస్తుంది.
- బండి స్పీడ్ లిమిట్‌లో పెట్టుకోవాలి. ముందు వెళ్తున్న వాహనాలను అనవసరంగా ఓవర్ టేక్ చేసే ప్రయత్నం చేయొద్దు.

- రాత్రంతా మంచు కురవడంతో రోడ్లు తడిగా ఉంటాయి. బ్రేకు లేసినా వాహనం జారి పడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వెహికల్ లైట్లు సరిగా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి.
- వాహనాలను రోడ్ల పక్కకు తీసుకెళ్లి ఖాళీ ప్రదేశంలో లేదా వెలుతురు ఉన్న చోట నిలిపితే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండకపోగా, ప్రమాదాలను నివారించవచ్చు.
- బండి ఆగిపోతే నంబరు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందిస్తే వాహనాన్ని తొలగించడం, ప్రమాద నివారణకు చర్యలు చేపడతారు.
- అద్దాలను తుడిచే వైఫర్లు సక్రమంగా ఉంచుకోవాలి. మోటర్ వెహికిల్స్‌లో జర్నీ చేసేటప్పుడు వైఫర్లు వేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.
- ప్రయాణించే వాహనం పూర్తిగా కండిషన్‌లో ఉండాలి. ఇంజిన్, టైర్లు, ముందు అద్దాలు సరిగ్గా ఉంటేనే నడుపాలి.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల

ప్రజా పాలన సభల్లో పాల్గొంటాం

ప్రజల సమస్యలపై పోరాడుతాం

ఆరు గ్యారెంటీల అమలుకు ఒత్తిడి తెస్తాం

బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 26 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజా పాలన సభల్లో పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవించి ఓటమిపై విశ్లేషణ చేసుకుంటామని అన్నారు. పదేండ్లుగా ప్రజలు అధికారం ఇస్తే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ఇప్పుడు అధికారంలో లేకున్నా ప్రజల కోసం రెట్టింపు ఉత్సాహంతో ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు. ప్రభుత్వ విధానాల్లో మంచి ఉంటే సహకరిస్తామని, చెడు ఉంటే పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన పాలన చేయలేదని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనడంలో వాస్తవం లేదని విమర్శించారు. రూ.3లక్షల కోట్ల అప్పులు చేస్తే కోట్లాది రూపాయల ఆస్తులను తయారు చేశామని చెప్పారు. 50ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలోనే చేసిందని తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వేద పత్రం విడుదల చేశారని అన్నారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఉండి పని చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సహకరించిన నాయకులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మల్లేశ్ పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభలో మాట్లాడుతున్న సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి

హృదయ స్పందనలు వినిపించేదే కవిత్వం

- కవి, రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రామగిరి, డిసెంబర్ 26 : మానవీయ హృదయ స్పందనలను వినిపించేదే నిజమైన కవిత్వమని ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండకు చెందిన ఆర్తికవి బైరెడ్డి కృష్ణారెడ్డి రచించిన 'సడి లేని గోస' దీర్ఘ కవితా పుస్తకం పరిచయ సభ మంగళవారం నల్లగొండలోని ఉనికి సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బైరెడ్డి తన కవిత్వంలో మానవీయ బంధాలను మృత్యుస్పృహను అర్థవంతంగా వ్యక్తీకరించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి, అంబటి వెంకన్న, బండారు శంకర్, సాగర్ల సత్తయ్య, పగడాల నాగేందర్, మునాస్ వెంకట్, స్కైబాబా, లింగనబోయిన లేఖానందస్వామి పాల్గొన్నారు.